క్లుప్తంగా

ఆలయ పురోహితులకు ఆర్థికసాయం



అర్చకులకు నగదు అందజేస్తున్న సదర్ శ్రీను

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలోని శ్రీ శివరామాంజనేయస్వామి దేవాలయంలో పురోహితులు, సిబ్బందిగా పనిచేస్తున్న వారికి గత కొంతకాలంగా జీతభత్యాలు లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన సదర్ శ్రీను నేనున్నాను అంటూ ముందుకొచ్చాడు. ఈ మేరకు సదర్ శ్రీను శనివారం ఆలయంలో గ్రామస్తుల సమక్షంలో అర్చకులకు, సిబ్బందికి రూ.40 వేల నగదును అందజేశారు. దీంతో గ్రామస్తులు శ్రీనును అభినందించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు మాజీ సభ్యులుకొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నర్సింలు, నాయకులు బాల్‌రెడ్డి, వెంకటయ్య, లింగం, ప్రభయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నం వడ్డిస్తున్న సుమన

షాద్‌నగర్: పట్టణంలోని అయ్యప్ప కాలనీలో ఉన్న నవోదయ వృద్ధాశ్రమంలో శనివారం విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు విఠల్‌రావు, సుమన దంపతులు అన్నదానం చేశారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ చైర్మన్ రంగారెడ్డి, సుదీప్, మలగారి సత్యనారాయణ, జహీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై షార్ట్ ఫిలిం



షార్ట్ ఫిలిం షూటింగ్‌లో డీపీఎం స్వర్ణలత, మహిళలు

నందిగామ: రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలకు సంబంధించి డీఆర్డీఏ, సెర్ప్‌లలో రుణాలు తీసుకొని లబ్ధి పొందుతున్న వారిపై డీపీఎం స్వర్ణలత ఆధ్వర్యంలో శనివారం మండలంలోని చేగూరులో షార్ట్ ఫిలిం షూటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రధానంగా ఆర్థికంగా నిలబడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సహిస్తోందని, అందులో భాగంగా డీఆర్‌డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో రుణాలు తీసుకొని స్వయం ఉపాధి పొందుతున్న వారి గురించి షార్ట్ ఫిలిం తీస్తున్నామన్నారు. స్వయం ఉపాధి పొందుతున్న తీరును మహిళా సంఘాలకు వివరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం యాదగిరి, సీసీ అరుణ, మహిళా సంఘం సభ్యులు మంజుల, చంద్రకళ, సంతోష, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: పట్టణ చౌరస్తాలో శనివారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి, ఆయనకు అనుకూలంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజునాయక్, నాయకులు బాలకృష్ణ, సత్యనారాయణ, లింగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ప్రిన్సిపాల్ విద్యుల్లత

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదిగినప్పుడే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ప్రిన్సిపాల్ విద్యుల్లత అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం, స్వపరిపాలనా దినోత్సవం, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నేటి విద్యార్థులే రేపటి బావిభారత పౌరులని, విద్యార్థులు నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాలు

- టీచర్లు, ఆయాలు విద్యాబుద్ధులకు దూరమవుతున్న చిన్నారులు
- పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందని పౌష్టికాహారం
- పట్టించుకోని అధికారులు



మొయినాబాద్ మండలం శ్రీరాంనగర్‌లో మూతపడిన అంగన్‌వాడీ కేంద్రం



మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో మూతపడిన అంగన్‌వాడీ కేంద్రం

మొయినాబాద్: టీచర్లు, ఆయాలు లేక అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో ఐసీడీఎస్ ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందాల్సిన పౌష్టికాహారం సరిగా అందడంలేదు. ప్రభుత్వాలు మారుతున్నా అంగన్‌వాడీలను పట్టించుకునే నాథులే కరువయ్యారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

వివిధ కారణాలతో..

మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్, శ్రీరాంనగర్, ఎత్‌బార్‌పల్లి గ్రామాల్లో దయనీయ పరిస్థితి నెలకొంది. అజీజ్‌నగర్-1, అజీజ్‌నగర్-2, శ్రీరాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసే టీచర్లు కొంత కాలం క్రితం వివిధ కారణాలతో రిజైన్ చేశారు. అజీజ్‌నగర్-1 అంగన్‌వాడీ కేంద్రంలో ముందు నుంచే ఆయా పోస్టు ఖాళీగా ఉంది. శ్రీరాంనగర్‌లో రెండేళ్ల క్రితం ఆయా అనారోగ్యంతో మరణించారు. దీంతో అజీజ్‌నగర్-1, శ్రీరాంనగర్‌లో ఆరు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రం మూతపడింది. ఇక ఎత్‌బార్‌పల్లి గ్రామంలో సుమారు రెండేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రం తెరుచుకోవడమే లేదు. ఈ సెంటర్‌లో సైతం టీచర్, ఆయా ఇద్దరూ రిజైన్ చేయడంతో అంగన్‌వాడీ కేంద్రం మూతపడింది. అజీజ్‌నగర్-2 సెంటర్‌లో టీచర్ లేకపోవడంతో ఆయా మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాన్ని నడిపిస్తున్నారు. హిమాయత్‌నగర్‌కు మినీ అంగన్‌వాడీ కేంద్రం మంజూరైనా ఇప్పటివరకు సెంటర్ ఏర్పాటు చేయలేదు. టీచర్ పోస్టు సైతం ఖాళీగా ఉంది.

56 అంగన్‌వాడీ కేంద్రాలు..

మొయినాబాద్ మున్సిపాలిటీతో పాటు మండలం మొత్తంలో 56 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిని రెండు సెక్టార్లుగా విభజించారు. మొయినాబాద్ సెక్టార్ పరిధిలో 28 అంగన్‌వాడీ కేంద్రాలు, హిమాయత్‌నగర్ సెక్టార్ పరిధిలో 28 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. హిమాయత్‌నగర్ సెక్టార్ పరిధిలోని అజీజ్‌నగర్-1, అజీజ్‌నగర్-4, బాకారం-1, ఎనికేపల్లి-1, నాగిరెడ్డిగూడ, అప్పోజీగూడ, చందానగర్, రెడ్డిపల్లి, చిన్నమంగళారం-1, మొయినాబాద్ సెక్టార్ పరిధిలోని అమీర్‌గూడ, చాకలిగూడ, ఎత్‌బార్‌పల్లి, కనకమామిడి-2, కనకమామిడి-3, కేతిరెడ్డిపల్లి-1, మొయినాబాద్-1, మొయినాబాద్-2, నజీబ్‌నగర్, శ్రీరాంనగర్, చిన్నషాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు లేరు. ఆ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి.

అందని పౌష్టికాహారం..

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తోంది. 3-5 సంవత్సరాల పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తే వారికి భోజనం, గుడ్డు, పాలు ఇస్తారు. అదే విధంగా గర్భిణులకు సైతం మధ్యాహ్నం భోజనం, గుడ్డు, పాలు అందజేస్తారు. అజీజ్‌నగర్, శ్రీరాంనగర్, ఎత్‌బార్‌పల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లు మూతపడటంతో పిల్లలు, గర్భిణులకు సరిగా పౌష్టికాహారం అందడంలేదు. 6 నెలల నుంచి 3 సంవత్సరాలలోపు పిల్లలకు బాలామృతం, గుడ్లను అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ఇంటికి అందజేస్తారు. అయితే టీచర్ల లేక అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డ గ్రామాల్లో పక్క గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు నెలలో రెండు సార్లు వచ్చి బాలామృతం, గుడ్లు ఇస్తున్నారు.

త్వరలోనే పోస్టులు భర్తీ అవుతాయి

మొయినాబాద్ సెక్టార్ పరిధిలోని శ్రీరాంనగర్, ఎత్‌బార్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు లేరు. ప్రస్తుతం పక్క గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు ఆయా గ్రామాల్లోని పిల్లలకు బాలామృతం, గుడ్లు ఇస్తున్నారు. ప్రభుత్వం త్వరలోనే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉంది. రిక్రూట్‌మెంట్ కాగానే అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకుంటాయి.

– సునీత, సూపర్‌వైజర్, మొయినాబాద్ సెక్టార్

పట్నం రాజేందర్‌రెడ్డి ఆశయసాధనకు కృషి

శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



చేవెళ్లలో పట్నం రాజేందర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మహేందర్‌రెడ్డి తదితరులు

షాబాద్: దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు తమ వంతు కృషి చేస్తామని శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం దివంగత పట్నం రాజేందర్‌రెడ్డి 37వ వర్ధంతి సందర్భంగా పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో రాజేందర్‌రెడ్డి విగ్రహానికి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలోనే షాబాద్ మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామన్నారు. దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశాడని, ఆయన ఆశయసాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలఅధ్యక్ష, కార్యదర్శులు గూడూరు నర్సింగ్‌రావు, శ్రీరాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు నక్క శ్రీనివాస్‌గౌడ్, పొన్న నర్సింహారెడ్డి, వెంకటయ్య, నాయకులు ఉన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: దివంగత పట్నం రాజేందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి శనివారం శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా యువజన అధ్యక్షుడు పట్నం అవినాశ్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు ఎం.కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సింగ్‌రావు, రమేశ్‌రెడ్డి, మానిక్యరెడ్డి, ఆగిరెడ్డి, ప్రభాకర్, దేవర వెంకట్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, ఎం. యాదగిరి, హన్మంత్‌రెడ్డి, నరేందర్, శ్రీధర్‌రెడ్డి, క్రిష్ణ, రవి, మల్లేశ్, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు 25శాతం రిబేట్

శంకర్‌పల్లి: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు మార్చి 31వరకు 25శాతం రిబేట్ కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ యోగేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న వారికి, అదేవిధంగా ఈ నెల 31వరకు చేసుకునేవారికి అవకాశం ఉందని, క్రమబద్ధీకరించుకొని వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్చి 31వరకు అవకాశమని, తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్త దరఖాస్తులను స్వీకరించేది లేదని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని, సందేహాలు ఉన్నవారు నివృత్తి చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

విద్యాభివృద్ధిపై కార్పొరేట్‌లకు చిత్తశుద్ధి లేదు

ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్

చేవెళ్ల: కార్పొరేట్ విద్యాసంస్థలకు విద్యాభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని, కేవలం వ్యాపారమే వారి ధ్యేయంగా పనిచేస్తున్నారని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ క్లోం సూర్యప్రకాశ్ అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలను శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో తనిఖీ చేసి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్లలోని శ్రీచైతన్య పాఠశాలలో 9, 10వ తరగతులకు ఎలాంటి పర్మిషన్ లేదని, దీనిపై పలుమార్లు విద్యాధికారులు తనిఖీ చేసి సీజ్ చేసినా పాఠశాల యాజమాన్యం మళ్లీ తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు చందు, మహిపాల్, ప్రదీప్, ప్రేమ్, ఆకాశ్, వెంకటేశ్, ప్రకాశ్, రాజేశ్, అశోక్, తీరు, రోహిత్, నితన్, నరేశ్, విద్యార్థులు ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేయాలి

ఎస్‌ఐ శ్రీనివాస్

కొత్తూరు: సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్‌ఐ శ్రీనివాస్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కొత్తూరు తండాలో ఉన్న హనుమాన్ ఆలయంలో శనివారం స్థానిక బీఆర్‌ఎస్ నేత రవినాయక్ తనసొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. రవినాయక్‌ను నాయకులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, దేవేందర్‌యాదవ్, సోమ్లనాయక్, వెంకటేశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కారోబార్ల సమస్యలు పరిష్కరించాలి

కేశంపేట: కారోబార్లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కారోబార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జంగయ్య అన్నారు. శనివారం మండల కారోబార్లు, బిల్ కలెక్టర్లతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మండల కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ మండల అధ్యక్షుడిగా రవి, ఉపాధ్యక్షుడిగా పాండు, కార్యదర్శిగా బాలరాజ్, కోశాధికారిగా కృష్ణ, అధికార ప్రతినిధిగా రాజు, సలహాదారులుగా యాదయ్య, శివ, రమేశ్, మురళీ, అంజనేయులు, శ్రవణ్, శ్రీను ఎన్నికయ్యారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామస్థాయిలో మరింత విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసిందని ఆరోపించారు. అయినా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాటకు పూర్తిగా కట్టుబడి ఉండి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి ప్రజలకు వివరిస్తామని, ఇందుకుగాను పార్టీ నాయకులు, కార్యకర్తలను సిద్ధం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, వీరేశం, జంగ నర్సింహ్మ, రాజు, సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, తిరుపతిరెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి



షాద్‌నగర్: అమరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



చేవెళ్లలో నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహామాదిగ

షాద్‌నగర్: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అమరులైన మాదిగ అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహామాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు శనివారం షాద్‌నగర్ పట్టణ చౌరస్తా వద్ద అమరుల చిత్రపటానికి నివాళులర్పించారు. మందకృష్ణ మాదిగ సారథ్యంలో అందరూ పోరుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, సుదర్శన్, బొబ్బిలి పాండు, చెన్నగళ్ల శ్రావణ్, యాదయ్య, సురేశ్, వెంకటేశ్, మహేందర్, శివకుమార్, ప్రేమ్‌కుమార్, చెన్న కేశవులు, శివ, నర్సింహ, ఉదయ్, మధు, కార్తీక్ పాల్గొన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: వర్గీకరణ పోరాటంలో అమరులైన మాదిగ అమరవీరుల త్యాగం ఎప్పటికీ మరువలేనిదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్యాసారం శంకర్‌రావుమాదిగ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్, పూలే విగ్రహాల ఎదుట శనివారం మాదిగ అమరవీరుల చిత్రపటానికి మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ సంఘాల నాయకులు యాదయ్య, గంగారం నరేశ్, గాజులగూడా వెంకటేశ్, శాంతికుమార్, చందు, శివగల విజయ్‌కుమార్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

అమరవీరుల త్యాగం వృథా కాదు

షాబాద్: ఎమ్మార్పీఎస్ అమరవీరుల త్యాగం వృథా కాదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్యాసారం శంకర్‌రావుమాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అక్కమొళ్ల జంగయ్య పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఎమ్మార్పీఎస్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు ముక్కు విశ్వంమాదిగ, మండల అధికార ప్రతినిధి మల్కి ప్రవీణ్, నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు త్వరలో అద్దాల పంపిణీ

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: కంటి సమస్యలు ఉన్న విద్యార్థులకు త్వరలో అద్దాలను పంపిణీ చేస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో గత 11రోజులుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. చివరి రోజు శనివారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని డాక్టర్ విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల కంటి సంరక్షణకు చర్యలు చేపట్టిందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లు, టీవీలను అధికంగా చూడటంతో కంటి సమస్యలు తలెత్తుతాయని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. బాగా వెలుతురు ఉన్న ప్రాంతంలో విద్యార్థులు చదువుకోవాలని, పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తినాలని పేర్కొన్నారు. గత 11 రోజులుగా నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరంలో శంషాబాద్, మహేశ్వరం, ఆమనగల్లు, షాద్‌నగర్ ప్రాంతాలకు చెందిన 3,508 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. దృష్టి లోపం ఉన్న వారికి త్వరలో వారి పాఠశాలలు, హాస్టళ్లలో అద్దాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్లు మాధవీలత, విజయలక్ష్మి, సౌజన్య, పద్మలత, పుష్పలత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి తదితరులు

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

నందిగామ: సమాజంలోని ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వెంకమ్మగూడలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణాన్ని గ్రామస్తులు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ హాజరై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని సూచించారు. దైవకార్యక్రమాలతోనే గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్, చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి అశోక్, శ్రావన్, రాజు, కుమార్, జేకే నర్సింహ, మాజీ ఉపసర్పంచ్ కుమార్‌గౌడ్, నాయకులు మెండే కృష్ణ, కుమార్, మల్లేశ్, శ్రీశైలం, సురేశ్‌గౌడ్, విజయ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దంపతులు, భక్తులు

నందిగామ: మండల పరిధిలోని వెంకమ్మగూడలో శివపార్వతుల కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దంపతులు పాల్గొని స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహ యాదవ్, నాయకులు సాలయ్య, వీరేందర్ గౌడ్, మధు, వేణు, కృష్ణ, రవీందర్, సతీశ్, పసుల బుచ్చయ్య, మంకాల శ్రీశైలం, అన్వర్, సాములయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



శంకర్‌పల్లి జట్టుకు బహుమతి అందజేస్తున్న శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

షాబాద్: షాబాద్ పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించేందుకు తమవంతు కృషి చేస్తామని శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం దివంగత పట్నం రాజేందర్‌రెడ్డి 37వ వర్ధంతిని పురస్కరించుకొని గత వారం రోజులుగా దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి స్మారకార్థం నిర్వహించిన నియోజకవర్గస్థాయి, క్రికెట్, వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి బహుమతులు అందజేశారు. క్రికెట్ పోటీల్లో శంకర్‌పల్లి జట్టు మొదటి బహుమతి సాధించగా.. వారికి రూ.2లక్షల రూపాయల నగదు మెమెంటో, రెండో బహుమతిగా నిలిచిన చేవెళ్ల జట్టుకు రూ.1లక్ష నగదు, మెమెంటో అందజేశారు. వాలీబాల్‌లో మొయినాబాద్ జట్టు ప్రథస్థానంలో నిలువగా వారికి రూ.50వేల నగదు, మెమెంటో, రెండోస్థానంలో నిలిచిన పీఆర్‌ఆర్ జట్టుకు రూ.25వేల నగదు, మెమెంటోను అందజేసి, సత్కరించారు. పట్నం అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తన తండ్రి దివంగత నేత రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గూడూరు నరింగ్‌రావు, శ్రీరాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వెంకటయ్య, నక్క శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, క్రీడా నిర్వాహకులు మహేశ్‌యాదవ్, రమేశ్‌యాదవ్, ధనుంజయ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు, నాయకులు తదితరులు ఉన్నారు.

కనుల పండువగా రథోత్సవం



రథం ఊరేగింపులో నృత్యాలు

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్ గ్రామంలోని మహాలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవాన్ని భక్తులు, గ్రామస్తులు కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ప్రతిష్ఠించి భజనలు, కోలాటాలు, పాటలతో గ్రామ వీధుల్లో రథాన్ని ఊరేగించి తిరిగి దేవాలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఊరేగింపులో చిన్నారుల నృత్యాలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామస్తులు పర్వతాలు, రాములు, నర్సింలుగౌడ్ శ్రీను, లక్ష్మారెడ్డి, జయమ్మ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

చేవెళ్ల: దామరగిద్ద గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మాజీ సర్పంచ్ ఎం.వెంకటేశం గుప్తా అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్దలో శనివారం రూ.10లక్షల నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, యువకులు మాల నర్సింలు, అంజయ్య, అనిల్, బోడ రామయ్య, మల్లేశ్, శేఖర్, స్వామి భీంరాజ్, కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ గూటికి మాజీ ఎంపీపీ

కేటీఆర్ సమక్షంలో 300ల మందితో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

శంకర్‌పల్లి: తాజా మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి బీజేపీ నుంచి తిరిగి సొంత గూటి(బీఆర్‌ఎస్)కి చేరుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితారెడ్డి సమక్షంలో సుమారు 300 మంది(బీజేపీ, కాంగ్రెస్) అనుచరులతో ఆయన బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ గోవర్ధన్‌రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ, కేసీఆర్, కేటీఆర్ నాకు రాజకీయంగా ఎంపీపీగా నిలబడేందుకు అవకాశం కల్పించారని, కొంత మంది వ్యక్తుల అనవసర ఆరోపణలు నమ్మి పార్టీ మారాల్సి వచ్చిందని గుర్తుచేసుకున్నారు. ఇప్పటి నుంచి బీఆర్‌ఎస్ పార్టీలోనే చివరి వరకు ఉండి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని, కేటీఆర్ మార్గ నిర్దేశంలో పనిచేస్తానని స్పష్టం చేశారు. మాజీ ఎంపీపీతో పాటు శంకర్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీధర్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి పెద్దఎత్తున యూత్ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజునాయక్ పాల్గొన్నారు.